పొలాల్లోనే ఉత్పత్తులు.. ఆందోళనలో రైతులు

- వర్షంతో తడిసిన పంటలు
- పంటలను కాపాడుకునే పనిలో రైతులు, మిల్లర్లు
- బాపట్ల, వేమూరుల్లో అకాల వర్షాలు

వేమూరు: అకాల వర్షం వల్ల ఆరుగాలం కష్టపడి పండిస్తున్న పంటలు, రైతులకు ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. రబీలో జొన్న, మొక్కజొన్న పంటలను రైతులు పండించారు. సోమవారం మధ్యాహ్నం వడగండ్ల వర్షం కురిసింది. దీంతో రైతులు పండించిన జొన్న, మొక్కజొన్న పంటలు తడిసి పోయాయి. ప్రస్తుతు రైతులు తడిసిన మొక్కజొన్న పంటను ఎండ బెట్టుకుంటున్నారు. శ్రీరామనవమి పండగ ముందు వర్షం రావడంతో కొంత మేరకు పంటలు దెబ్బతిన్నాయి. వర్షాల వల్ల పంటలు దెబ్బతినడంతో రైతులకు వ్యవసాయ ఖర్చులు అదనపు భారం పడిందిని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాలు వల్ల పంటలు దెబ్బతిన డంతో రబీ పంటలు సాగు చేయడం కష్టంగా ఉందని రైతులు చెబుతున్నారు. రబీ పంటలు దెబ్బతినడం వల్ల పెట్టుబడి ఖర్చులు వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు. అకాల వర్షాల వల్ల జొన్న, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం ఇంత వరకు గిట్టుబాటు ధర ప్రకటించలేదని, వెంటనే ప్రకటించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. దళారులు తక్కువ రేటుకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో పెట్టుబడులు రావడం కూడా కష్టమని రైతులు ఆవేదన చెందుతున్నారు.

■ రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి జొన్న, మొక్కజొన్న పంటలను కొనుగోలు చేయాలని, అపరాల పంటలైన మినుము, పెసర పంటలు రైతులు తక్కువ ధరకు అమ్ముకున్న తర్వాత కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో క్వింటాకు రూ.రెండు వేల నష్టం జరిగిందని రైతులు తెలిపారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



తడిసిపోయిన మొక్కజొన్న పంటను ఆరబెడుతున్న రైతులు

బాపట్లటౌన్: అకాల వర్షం అటు అన్నదాతలు... ఇటు రైస్ మిల్లర్లను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. బుధవారం ఉదయం కురిసిన వర్షానికి రైతులు కలవర పాటుకు గురయ్యారు. ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికందే తరుణంలో ఎక్కడ వర్షానికి తడుస్తుందోనని భయభ్రాంతులకు గురవుతున్నారు. మండలంలోని గుడిపూడి, భర్తిపూడి, చుండూరుపల్లి, అప్పికట్ల, ఈతేరు, పూండ్ల గ్రామాల్లో మినుము, మొక్కజొన్న రాశులు పొలాల్లోనే ఉన్నాయి. వీటితోపాటు వరికుప్పలు ఇప్పటికీ పొలాల్లోనే ఉన్నాయి. ప్రస్తుతం కురిసిన వర్షానికి పైర్లు ఎక్కడ చేతికందకుండా పోతాయోనని రైతులు సతమతమవుతున్నారు. మండలంలోని పిన్నిబోయినవారిపాలెం, నందిరాజుతోట, మరుప్రోలువారిపాలెం, పాండురంగాపురం, ముత్తాయపాలెం, అసోదివారిపాలెం గ్రామాల్లో వేరుశనగ, రాగుల రాశులు పొలాల్లోనే ఉన్నాయి. వర్షానికి తడవడంతో రంగుమారి వేరుశనగ, రాగులు పాడైపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.



ధాన్యం బస్తాలపై పట్టాలు కప్పిన మిల్లర్లు



వరికుప్పలపై పట్టాలు కప్పిన రైతులు

మిల్లర్లదీ అదే పరిస్థితి

సాధారణంగా ప్రతి ఏడాది కేవలం కుప్పలు నూర్పిడి చేసే సమయంలో మాత్రమే రైస్ మిల్లులకు ధాన్యం వస్తుంది. అయితే ఈ ఏడాది కోతలు కోసే తరుణంలో వర్షాలు రావడంతో ఉన్నతాధికారుల సూచనల మేరకు మండలంలోని రైతులు నేరుగా హార్వెస్టింగ్ చేయించి ఆ ధాన్యం మిల్లులకు తోలారు. వాటితోపాటు గడిచిన రెండు నెలల నుంచి కుప్ప నూర్పిడి చేసిన ధాన్యం కూడా మిల్లుల్లో స్టాకు ఉంది. దీంతో పట్టణంలోని ఏ రైస్ మిల్లులో చూసినా ధాన్యం బస్తాల నిల్వలు వేల సంఖ్యలో ఉన్నాయి. ఉన్న పళంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకొని వర్షం పడటంతో మిల్లులోని ధాన్యం బస్తాలను కాపాడుకునే పనిలో మిల్లర్లు నిమగ్నమయ్యారు. వర్షానికి రైస్ మిల్లుల్లో చాలావరకు ధాన్యం తడిసిపోయాయి. అవకాశం ఉన్నంతవరకు మిల్లర్లు పట్టాలు కప్పుకొని ధాన్యంను కాపాడుకుంటున్నారు. మరలా వర్షం పడితే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని మిల్లర్లు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖర్చుల భారం పెరిగింది



సోమవారం మధ్యాహ్నం కురిసిన వర్షం వల్ల మొక్కజొన్న పంట పాడైపోయింది. 15 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. జొన్న పంట రెండు ఎకరాలు సాగు చేశాను. వర్షం వల్ల మొక్కజొన్న పంట మొత్తం తడిసిపోయింది. జొన్న పంట తడిసిపోయింది. దీంతో వ్యవసాయ ఖర్చుల భారం పెరిగింది.

– తమ్మా పాముల రెడ్డి, చినపరిమి, చుండూరు మండలం

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ప్రభుత్వం జొన్న, మొక్కజొన్న పంటలకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో తక్కువ ధరకు దళారులకు అమ్ముకునే పరిస్థితి నెలకొంది.

– కుర్రె ప్రతాప్ రెడ్డి, చినపరిమి, చుండూరు మండలం

ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో ప్రాణాంతక వ్యాధులు

మునిసిపల్ కమిషనర్ సాంబశివరావు



రేపల్లెరూరల్: ఎలక్ట్రానిక్ వ్యర్థాలలో (ఈ వేస్ట్) ఉండే సీసం, కాడ్మియం వంటి లోహాల వల్ల నీరు, నేలలో కాలుష్యం పెరిగి ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తాయని మునిసిపల్ కమిషనర్ కే సాంబశివరావు చెప్పారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం పలు ప్రభుత్వ కార్యాలయాలలో పనికి రాకుండా ఉన్న ఈ వేస్ట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో పర్యావరణం దెబ్బతింటుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో ఉన్న పనికిరాని కంప్యూటర్‌లు, మానిటర్‌లు ప్రింటర్‌లను బయట పారవేయకూడదన్నారు. వీటిని పురసాలక సిబ్బందికి ఇవ్వడం వల్ల రీయూజ్, రీసైక్లింగ్‌కు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీవో శోభారాణి, సబ్ రిజిస్ట్రార్ కిషోర్‌కుమార్, ఎస్టీవో మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసులు

తెనాలిరూరల్: చిన్న పిల్లలు ఆడుకునే విషయంలో జరిగిన గొడవలో పెద్దలు కలుగజేసుకుని రెండు వర్గాలుగా విడిపోయి పరస్పర దాడికి పాల్పడిన ఘటనపై రూరల్ పోలీసులు నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేశారు. తెనాలి మండలం పెదరావూరులోని చినపల్లెలో ఈ నెల 12వ తేదీ రాత్రి చిన్న పిల్లలు ఆడుకునే విషయంలో గొడవ జరిగింది. ఇందులో పెద్దలు కలుగేసుకుని, గరిక వెంకటేశ్వరరావు ఒక వర్గంగా, కనపర్తి శిరీష మరో వర్గంగా విడిపోయి పరస్పర దాడులకు పాల్పడ్డారు. ఘటనలో 10 మందిపై గురువారం నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ కె. ఆనంద్ తెలిపారు.

క్లుప్తంగా

చక్కగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలి



బాపట్ల: చక్కగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని ఎస్ఎంజీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.దుర్గా ప్రసాదరావు పేర్కొన్నారు. ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు గురువారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జి.దుర్గాప్రసాదరావు మాట్లాడుతూ విద్యార్థినులు జీవితంలో రాణించి, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని వ్యవస్థాపకుల ఆశయాల సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపకులు వెలగపూడి సుబ్బారావు, సరస్వతమ్మల పేరిట మెడల్స్‌ను కూడా అందజేశారు. కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి డాక్టర్ పీసీ సాయి బాబు, అధ్యాపకులు సతీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 25 మందికి ఉద్యోగావకాశం




నగరం: తీర ప్రాంతంలోని యువతీయువకులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు దివిస్ లేబొరేటరీ కృషి చేస్తుందని కళాశాల కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చియ్యచౌదరి చెప్పారు. స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో గురువారం హైదరాబాద్‌కు చెందిన దివిస్ లేబొరేటరీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చియ్య చౌదరి మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల నుంచి దివిస్ లేబొరేటరీ వారు కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించి యువతీయువకులకు ఉద్యోగావకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. జాబ్‌మేళాకు 80 మంది హాజరుకాగా 25 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. అనంతరం ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. అకడమిక్ డైరెక్టర్ వెంకటేశ్వరావు, ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ, సజ్జా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఒకేషనల్ కోర్సు తరగతులు ముగింపు



వేమూరు: ఆలపాటి వెంకట్రావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఒకేషనల్ కోర్సులు నేర్పించడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుర్రా శ్రీనివాసరరావు తెలిపారు. చుండూరు మండలంలోని యడ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎం శ్రీ ఒకేషన్ తరగతులు 10 రోజులు నుంచి నిర్వహించడం జరిగిందన్నారు. ఎలక్ట్రానిక్ ట్రేడ్ విభాగం కింద విద్యార్థులకు ఎలక్ట్రానిక్ వస్తువుల వాడకం, వాటి మరమ్మతులు, అగ్రికల్చర్ ట్రేడ్ కింద ఎరువుల వాడకం, పురుగు మందులు గురించి గురువారం వివరించారు. విద్యార్థులకు ఎలక్ట్రానిక్ వస్తువులు తయారు చేసే విధానం గురించి నేర్పించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ ట్రేడ్ షాపుల యాజమాన్యాలు పాల్గొన్నాయి.

ప్లాట్‌ఫాంపై మహిళ మృతి



తెనాలిరూరల్: తెనాలి రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై మహిళ మృతి చెందింది. పట్టణ చెంచుపేటకు చెందిన రేవూరి నాగ రంజిత (60) జేఎంజే కళాశాలలో పని చేస్తోంది. గురువారం తెనాలి స్టేషనుకు వచ్చిన ఆమె ఒకటో నంబరు ప్లాట్‌ఫాంపై కుప్పకూలింది. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించగా ఆమె ఆధార్ కార్డు, కొన్ని కోర్టు పత్రాలు లభించాయి. మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గతంలో చేసిన అప్పులకు కోర్టులో శాలరీ అటాచ్‌మెంట్ పిటిషన్ వేశారని, ఈ క్రమంలో ఆమె గుండెపోటుతో మృతిచెందిందా లేక మరోదైనా కారణముందా అన్నది పోస్టుమార్టం అనంతరం తెలుస్తుందని జీఆర్పీ ఎస్ఐ వెంకటాద్రి తెలిపారు.

రేపు తెనాలిలో ఈ-వ్యర్థాలు నిర్వహణ

తెనాలిటౌన్: ఈ నెల 19వ తేదీన స్థానిక శివాజీచౌక్ సెంటర్‌లో ఈ-వ్యర్థాలు నిర్వహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వర్ణంధ్ర-స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 3వ శనివారం నిర్వహించే ఇ-వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పట్టణంలోని దుకాణదారులకు పిలుపునిచ్చారు. పాడైపోయిన కంప్యూటర్ పరికరాలు, మొబైల్స్, టేబుల్స్, బల్బులు, బ్యాటరీలు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకువచ్చి ఇవ్వాలని కోరారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు క్యాంపు ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు.

ఎక్సైజ్ చట్టాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

స్టేట్ టాస్క్‌ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి

నగరం: ఎక్సైజ్ చట్టాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని స్టేట్ టాస్క్‌ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.సుధాకర్‌రెడ్డి చెప్పారు. స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం స్టేషన్ పరిధిలోని మద్యం షాపు నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ నాటుసారా నిర్మూలన దిశగా చర్యలు చేపట్టాలన్నారు. సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దే విధంగా కృషి చేయాలని కోరారు. ఎక్సైజ్ చట్టాలకు అనుగుణంగా మద్యం షాపులను నడపాలన్నారు. నౌకర్‌నామాలు ఎటువంటి తప్పిదాలు చెయ్యకుండా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత లైసెన్స్‌దారులదేనన్నారు. ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయాలు జరపాలన్నారు. బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సీఐ మారుతి శ్రీరామ్ ప్రసాద్, ఎస్ఐ విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి

అగ్నిమాపక శాఖ అధికారి వై.సాంబశివరావు

రేపల్లె రూరల్: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరిలో అవగాహన ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారి వై.సాంబశివరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా రెయిన్‌బో స్కూల్లో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అగ్నిప్రమాదం వాటిల్లిన వెంటనే ఆందోళన చెందకుండా వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. వంట పూర్తవ్వగానే గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్‌ను ఆపివేయాలన్నారు. పెట్రోలు బంకుల వద్ద సెల్‌ఫోన్ మాట్లాడటం, ధూమపానం చేయరాదన్నారు. గృహాలలో, దుకాణాలలో విద్యుత్ వైర్లు సరిగ్గా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. లేని పక్షంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుని అగ్ని ప్రమాదాలు సంభవించిన సందర్భాలు ఉన్నాయన్నారు. అగ్ని ప్రమాదాలు వాటిల్లితే వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.




అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలి

మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి

బాపట్ల: వాట్సాప్ గవర్నెన్స్ వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి పేర్కొన్నారు. బాపట్ల మున్సిపల్ కార్యాలయంలో మనమిత్ర (వాట్సాప్ గవర్నెన్స్)పై అధికారులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ జి.రఘునాథరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందించు సేవలను సులభతరం చేస్తూ ఏర్పాటు చేసిన వాట్సాప్ నంబర్ 9552300009 ద్వారా ప్రభుత్వ సేవలను పొందవచ్చని సూచించారు. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ సేవలపై ప్రజలు అవగాహన కలిగించుకొని ధ్రువీకరణ పత్రాలను పొందవచ్చని, ప్రభుత్వ బిల్లులను సులభంగా చెల్లించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇంజనీర్ ఎస్.ఎస్.కృష్ణారెడ్డి, పట్టణ ప్రణాళిక అధికారి ఎస్. మల్లికార్జున రావు, మేనేజర్ పి.లక్ష్మయ్య, మెప్మా సీఎంఎం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి

'తానా' మాజీ అధ్యక్షుడు గంగాధర్‌కు సతీవియోగం

- అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి

తెనాలి: ప్రవాస భారతీయుడు, ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) మాజీ అధ్యక్షుడు నాదెళ్ల గంగాధర్‌కు సతీ వియోగం కలిగింది. ఆయన భార్య దుర్గ (65) హైదరాబాద్‌లోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ప్రస్తుతం బాపట్ల జిల్లా పరిధిలో ఉన్న పెదపులివర్రు దగ్గర్లోని గుత్తావారిపాలెం గంగాధర్ స్వస్థలం. ఆయన భార్య దుర్గ సమీపంలోని జిల్లేపల్లికి చెందినవారు. వివాహం తర్వాత గంగాధర్ అమెరికాలోని డెట్రాయిట్‌లో స్థిరపడ్డారు. వారికి ఇద్దరు కుమార్తెలు. ఇద్దరూ వైద్యవృత్తిలో ఉన్నారు. గంగాధర్ గతంలో 'తానా' అధ్యక్షుడిగా చేశారు. జులైలో డెట్రాయిట్‌లో జరగనున్న 24వ 'తానా' మహాసభలకు ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన భార్య దుర్గ కొంతకాలంగా అనారోగ్యంతో ఉండటంతో హైదరాబాద్‌లో చికిత్స అందిస్తున్నారు. అయినా ఫలితం లేదు. ఆమె అంత్యక్రియలు శుక్రవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు. దుర్గ మృతి పట్ల తానా కార్యవర్గ సభ్యులు, ప్రతినిధులు, తెలుగు సంఘాల ప్రతినిధులు, ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఆ కుటుంబానికి సానుభూతిని తెలిపారు.

లింగాకర్షణ బుట్టల వినియోగంపై అవగాహన

తెనాలిటౌన్: తెల్ల దోమల నివారణ, తామరపురుగు ఆకర్షించే లింగాకర్షణ బుట్టలు, జిగురు అట్టల వినియోగంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు సూచించారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో గురువారం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఆధ్వర్యంలో గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమం నిర్వహించారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణపై అవగాహన సదస్సు



రేపల్లెరూరల్: స్థానిక ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం సచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాలు-నిర్వహణ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ టీసీ రవిచంద్ర మాట్లాడుతూ విద్యార్థులు తమ గృహాలలో ఉన్న ఎలక్ట్రానిక్ వస్తువులను సక్రమమైన మార్గంలో డీ కంపోజ్ చేయాలన్నారు. ఈ-వ్యర్థాల వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదముందన్నారు. ప్రజల ఆరోగ్యానికి కూడా హానికరమన్నారు. ఈ వేస్ట్‌పై విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర సభ్యులు ఎం.బుచ్చిబాబు, బాలగురవయ్య పాల్గొన్నారు.

వాయిదాలకు హాజరుకాని నిందితుడి అరెస్ట్

తెనాలిరూరల్: కోర్టు వాయిదాలకు హాజరుకాని నిందితుడిపై అరెస్ట్ వారెంట్ జారీ కావడంతో పోలీసులు అతన్ని అరెస్ట్ చేశారు. తెనాలి రైల్వే స్టేషన్ సమీపంలో నివసించే షేక్ రబ్బానికి అతని అన్న అల్లుడైన నాయబ్ రసూల్‌తో కుటుంబ కలహాలు, ఆస్తి పంపకాల విషయంలో విభేదాలు ఉన్నాయి. ఈ క్రమంలో రబ్బానీని 2022 మార్చిలో నాయబ్‌రసూల్, అతని మిత్రుడైన విజయవాడ కండ్రిగకు చెందిన షేక్ జాన్‌బాబుతో కలసి హత్య చేశాడు. ఈ కేసులో వాయిదాలకు రాకుండా జాన్‌బాబు రెండేళ్ల నుంచి తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ క్రమంలో కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేయడంతో జాన్‌బాబును రూరల్ ఎస్ఐ కె. ఆనంద్ గురువారం అరెస్ట్ చేశారు.

పోషణ్ పక్వాడాపై సమావేశం

వేమూరు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందని అమర్తలూరు ప్రాజెక్ట్ అడిషన్ సీడీపీవో విజయరాణి తెలిపారు. వేమూరు మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వేమూరు అంగన్‌వాడీ సెక్టారు సమావేశం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు పాల్గొన్నారు. విజయరాణి మాట్లాడుతూ వేయి రోజుల గురించి అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలకు వివరించారు. గర్భిణి నుంచి రెండు సంవత్సరాలు బిడ్డ వరకు అందించు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతి నెలలో 0-6 నెలల బిడ్డల బరువు పరిశీలించడం జరుగుతుందన్నారు. బిడ్డలు బలహీనంగా ఉంటే వారి తల్లిదండ్రులు బిడ్డలకు అందించే పౌష్టికాహారంపై అవగాహన కల్పించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ నెల 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకు పోషణ్ పక్వాడాపై సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని ఆమె చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సజ్జా లక్ష్మీతిరుపతమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమృతవాణి, ఎంఈవో వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీవో విజయరాణి

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టండి

తెనాలిటౌన్: వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా సమగ్ర చర్యలు చేపట్టాలని అధికార యంత్రాగాన్ని ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సాధారణ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీపీ చెన్నకేశవులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశానికి 14 మంది ఎంపీటీసీలు హాజరుకాగా, ఏడుగురు గైర్హజరయ్యారు. వేసవి దృష్ట్యా తాగునీటి సమస్యలు ఉన్న గ్రామాలను గుర్తించి చేతిపంపులు, నీటి కుళాయి కనెక్షన్‌లు సత్వరం ఇవ్వాలని సూచించారు. అవసరమైన చోట్ల బోర్లు నిర్మాణం చేపట్టాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను ఆశాఖ సిబ్బంది తెలియజేశారు. ఎక్కడ అవినీతి అవకాశం లేకుండా ప్రతిష్ట చర్యలు చేపట్టాలని ఎంపీ సూచించారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి మండల పరిషత్ సంవత్సరిక లెక్కలను ఆమోదించారు. 31 మార్చి 2025 నాటికి ఇంకను ప్రారంభించని పనులను రద్దు చేసి వాటి స్థానంలో క్రొత్త పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గ్రామాల్లో విద్యుత్ లో ఓల్టేజ్ సమస్యలను సభ్యులు తెలియజేశారు. కుక్కల బెడద అధికంగా ఉందని, నివారించాలని కోరారు. గుడివాడ గ్రామంలో చేతిపంపుల అవసరత అధికంగా ఉందని, తక్షణం మంజూరు చేయాలని మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు కోరారు. కొలకలూరు గ్రామ పంచాయతీ పరిధిలో అనేక రకాలుగా అవినీతి జరుగుతుందని ఎంపీటీసీ కాలిశెట్టి ఫణికుమార్ ఆరోపించారు. సమగ్రమైన బిల్లులు లేకుండా శానిటేషన్ సిబ్బంది ఖాతాల్లో పెద్ద మొత్తంలో నగదు జమ చేస్తున్నారని విమర్శించారు. కరెంటు బిల్లు సకాలంలో చెల్లించడంలేదన్నారు. గ్రామంలో శానిటేషన్ సమస్య అధికంగా ఉందని, దీనికి తోడు సిబ్బంది కొరత వేంటాడుతుందని తెలిపారు. పలు గ్రామాల్లో బస్సు సర్వీసులు పునరుద్ధరించాలని సభ్యులు విజ్ఞప్తి చేశారు.



సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న ఈవోపీఆర్డీ ప్రసాద్

వ్యర్థాల తొలగింపును వేగవంతం చేయండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: కంపోస్టు యార్డులోని వ్యర్థాల తొలగింపును వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. కంపోస్టు యార్డును గురువారం ఆయన పరిశీలించి తరలింపు ప్రక్రియపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరచూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో తరలింపులో కొంత జాప్యం జరుగుతుందన్నారు. ఎట్టి పరిస్థితిల్లో మే చివరి నాటికి 60 శాతం తరలింపును పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏఈ సూరిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.



కంపోస్టు యార్డును పరిశీలిస్తున్న కమిషనర్

క్షయవ్యాధి నివారణకు చర్యలు



తెనాలిఅర్బన్: క్షయవ్యాధి నివారణకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పల్లికొండ రవికుమార్ పేర్కొన్నారు. గంగానమ్మపేట, సాలీపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లలో గురువారం ఊపిరితిత్తుల టీబీకి మందులు వాడుతున్న వ్యాధిగ్రస్తులతో నివాసిస్తున్న కుటుంబ సభ్యులకు సీవై టీబీ టెస్టులను ఎయిమ్స్ నుంచి వచ్చిన జూనియర్ రెసిడెంట్ వైద్యులు డాక్టర్ ఉత్కర్ష తివారి చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ 2025 నాటి క్షయ వ్యాధి లేని దేశంగా తీర్చిదిద్దేందుకు కేంద్రం కృషి చేస్తుందన్నారు. టీబీ రాకుండా ప్రివెన్సన్ థెరపీ ఇవ్వవచ్చని తెలిపారు. టీబీ సోకిన వారి కుటుంబ సభ్యులకు వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. వారు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారులు డాక్టర్ మౌనిక, కిషోర్, డాక్టర్ సిహెచ్.పుష్పలత, హెల్త్ విజిటర్స్ దిలీప్‌కుమార్, భార్గవి, స్టాఫ్ నర్సులు, ల్యాబ్‌టెక్నీషియన్లు పాల్గొన్నారు.